తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# శరవేగంగా సాగుతున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం ఏర్పాట్లు శరవేంగా సాగుతున్నాయి. దేవస్థానంలో సెప్టెంబర్ 18నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు కేవలం 17 రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఆలయ అధికారులు ఏర్పాట్లును శరవేగంగా సాగిస్తున్నారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం వంటి పనులను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గతంలో ప్రధాన ఆలయ రాజగోపురాలకు వున్న పంచవర్ణ రంగుల స్థానంలో ఆగమ శాస్త్ర ప్రకారం రంగులను వేస్తున్నారు. మిగిలిన ఏర్పాట్లును సకాలంలో పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



ప్రధాన ఆలయ రాజగోపురాలు, ఆలయాలకు రంగులు వేస్తున్న కార్మికులు

## గదుల రిజిస్ట్రేషన్ కౌంటర్లు...

# మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయండి

**-లడ్డూల్లో యాలకుల పొడి వినియోగించండి -మొబైల్ డిపాజిట్ కౌంటర్లు వద్ద డబ్బులు అడుగుతున్నారు -'డయల్ యువర్ ఇఒ' కు భక్తులు**



డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో ఇ.ఓ ఇతర అధికారులు

తిరుమల, సెప్టెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి: ఇష్టదైవమ్ దర్శనానికి తిరుమలకు వచ్చిన భక్తులకు గదుల కేటాయింపు కౌంటర్లు సిఆర్ఓ ప్రాంతంలోనే ఉండటంతో రద్దీ ఎక్కువగా ఉంటోందని, మరిన్ని ప్రాంతాల్లో కౌంటర్లు పెట్టండని మార్కాపురంనుండి ప్రసాద్ సూచించారు. నాలుగైదు చోట్ల కౌంటర్లు ఉంటే భక్తులకు సులభమవు తుందన్నారు. ఈ ప్రశ్నకు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి సమాధానమిస్తూ పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బెంగుళూరునుంచి కమలశేఖర్ మాట్లాడుతూ విష్ణుసహస్రనామం పారాయణానికి వస్తుంటామని, దర్శనం, వసతి కల్పించాలని, లడ్డూల్లో యాలకులను పొడిగా చేసి వినియోగించాలని కోరారు. దీనిపై స్పందించిన ఈఓ ఆన్‌లైన్‌లో దర్శనం, వసతి బుక్‌చేసుకుని రావాలని, లడ్డూలు తయారీకి సంబంధించి పోటుసిబ్బందితో చర్చిస్తామన్నారు. పాకాల నుండి కుమారస్వామి మాట్లాడుతూ మొబైల్‌ఫోన్‌లు డిపాజిట్ చేసుకునే కౌంటర్ల వద్ద డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ప్రశ్నకు ఈఓ సమాధానంగా తరచూ సిబ్బందికి సూచనలు ఇస్తున్నామని, ఇలాంటి వారిని గుర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఎవరికీ డబ్బులు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేస్తున్నా మన్నారు. శుక్రవారం ఉదయం అన్నమయ్యభవనంలో 'డయల్ యువర్ ఇఒ' కార్యక్రమం జరిగింది. దేశం నలుమూలల నుండి 28మంది భక్తులు తమతమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులు చేశారు. టిటిడి జెఈఓ సదాభార్గవి, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎస్వీబిసి సీఈఓ షణ్ముఖకుమార్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి ,ఏపిఆర్ఓ నీలిమారావు, ఆర్ 2 భాస్కర్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులతో కలిసి ఇఒ సమావేశం నిర్వహించారు. సీనియర్ సిటిజన్లకు ఆఫ్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు ఇవ్వాలని కోరారు. ఈ ప్రశ్నలకు సమాధానంగా ఈఓ ఏవి ధర్మారెడ్డి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులుకు సంబంధించి దర్శన కోటా పరిమితంగా ఉందని, అధికశాతం భక్తుల కోరిక మేరకు ఆన్‌లైన్‌లో ఈ టిక్కెట్లు విడుదల చేస్తున్నామన్నారు. త్వరలో వికాస్ విశ్రాంతి భవనంలో 45గదులను ఏసి చేసి గీజర్ వసతి కల్పిస్తామన్నారు. అనాకపల్లినుండి కృష్ణ మాట్లాడుతూ అన్నప్రసాదంలో అన్నం ముద్దగా ఉంటుందని, నాణ్యత పెంచాలని సూచించారు. ఈ ప్రశ్నకు ఇఒ కూడా అంగీకరిస్తూ టెండర్‌ద్వారా బియ్యం కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత తగ్గిందని గుర్తించామన్నారు. ప్రస్తుతం రైస్‌మిల్లర్లనుండి బియ్యం కొనుగోలుచేసేందుకు నిర్ణయించామన్నారు. మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు తయారుచేస్తామన్నారు. రాజమండ్రి నుండి రిషి మాట్లాడుతూ స్వామివారి కైంకర్యాలకు అవసరమైన పాలు, నెయ్యి దేశవాళీ గోవులతో తయారుచేయించండి అని కోరారు. ఈఓ స్పందిస్తూ ఈ ప్రక్రియను ప్రారంభించామని, 200 దేశవాళీ గోవులను సమకూర్చుకున్నామన్నారు. మరో 400 గోవులను సమకూర్చుకోవడానికి ఎస్వీ గోశాలలో ఏర్పాట్లుకూడా చేశామన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ముందే...

# ప్రీపెయిడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తాయా!?

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

తిరుమలకొండపై భక్తులు ట్యాక్సీడ్రైవర్ల చేతిలో నిలువుదోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకునేందుకు టిటిడి, జిల్లా పోలీసుయంత్రాంగం చేపట్టే చర్యలు దేవుని బ్రహ్మోత్సవాలకు ముందే అమలవుతాయా? అనేది ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. తమ కష్టాలు తీరితే నీ మొక్కుతీర్చుకుంటామని వేంకటేశ్వర స్వామిని వేడుకునే సామాన్యభక్తులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తిరుమల యాత్ర చేస్తుంటారు. భక్తులు తిరుమలకు చేరుకోవడానికి, తిరుమలలో పలుప్రాంతాల సందర్శనకు ప్రైవేట్ ట్యాక్సీడ్రైవర్ల చేతిలో దగాప డు తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ చేతిలోని డబ్బులు ట్యాక్సీలకు ఖర్చయితే తిరుగు ప్రయాణం ఎలా అనే ఆవేదన కూడా అధికశాతం మంది భక్తులు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతికి చేరుకున్న భక్తులు వీలునుబట్టి ప్రైవేట్ ట్యాక్సీలపై ఆధారపడుతున్నారు. తిరుమలకు చేరుకున్న భక్తులు బాలాజీ ప్రధాన ఆర్టీసి బస్టాండ్, ఆలయం సమీపంలోని రాంభగీచా బస్టాండ్‌ల నుంచి అద్దె గదుల కోసం సిఆర్ఒ, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి విచారణ కార్యాలయాలకు చేరుకోవాలంటే ఉచిత బస్సులు నడుస్తున్నా ప్రైవేట్ ట్యాక్సీలు ఆశ్రయిస్తున్నారు. బసచేసిన కాటేజీ ప్రాంతాల నుంచి దర్శనానికి వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్, ఏటిసి క్యూలైన్, ఏటిజిహెచ్ క్యూలైన్, వైకుంఠమ్ 2 క్యూలైన్‌ల వద్దకు చేరుకోవడానికి ట్యాక్సీలే శరణ్యం. ఈ నేపథ్యంలో తిరుమలలో ఏకంగా ఒక భక్తునికి 50 రూపాయలు లెక్కన జీపు, కార్లు, ఇతరత్రా వాహనాల్లో 200 రూపాయల నుండి 500 రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారనేది భక్తుల ఫిర్యాదులు. బస్టాండుల్లో దిగితే భక్తులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ట్యాక్సీలపైనే ఆధారపడాల్సి వస్తుంది. తిరుమలలో స్థానిక ఆలయాలు పాపవినాశనం, జాపాలి, ఆకాశగంగ, వేణు గోపాలస్వామి ఆలయం, శిలాతోరణం, శ్రీవారిపాదాలు ఇలా భక్తులు సందర్శి ంచడానికి సుముఖత చూపుతున్నారు. ఆర్టీసి బస్సుల్లో ఈ ప్యాకేజీ 120 రూపాయలుగా నిర్ణయించారు. ట్యాక్సీడ్రైవర్లు వాహనాలను బట్టి భక్తులకు సౌకర్యంగా ఒక్కొక్కరికి 150 రూపాయలు వసూలు చేస్తుంటారు. పదిమంది వరకు భక్తులు ఉంటే ప్యాకేజీగా 1,500నుండి 2వేల రూపాయల వరకు అద్దె వసూలుచేస్తుంటారు. కొండపై ప్రీపెయిడ్ ట్యాక్సీలు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

## కరవు మేఘాలతో...

# కర్షకులు ఢీలా



కోట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త : జిల్లాలో వర్షా భావ పరిస్థితులతో కరవు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. ఈనెల 15 లోపు సాగుకు సరిపోయే వర్షం పడక పోతే కరవు కింద ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే వేయాల్సిన పంటలకు కాలం దాటిపోయింది. ఆడపాదడపా కురిసిన వర్షాలకు వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. రుతుపవనాలు ముఖం చాటేశాయి, తుఫానుల జాడ లేదు, ఇక నవంబర్ నెల వర్షాలుపై దృష్టి పెడితే, సాగు ముందుకు సాగదని రైతన్న వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వేసిన వరి కూడా ఎండి పోతుందని కర్షలకు వాపోతున్నారు. తెలుగుగంగా జలాలు విడుదల చేసి ఆదుకొవలాని అధికారులను కోరిని అధికారులు గెట్లు వాల్‌లు పోయి ఉన్నాయోని ఏవో సాకులు చెబుతు వచ్చారు. ఊనుగుంటపాళెం, చిట్టేడు, కేశవరం, మద్దాలి, తదితర గ్రామాల్లో నీరులేక వరి వెండిపోతుంది. ఇదే విధంగా ఎండలు మరి కొన్ని రోజులు కొనసాగే వేసిన పంటల్లో సగానికి పైగా దెబ్బతింటాయని వాపోతున్నారు. బోర్లులో నీరు ఇంకిపోవడంతో రైతులు తెల్లమఖాలు వేస్తున్నారు. ఖరీఫ్ పంటలు సాగు చేయలేకపోయిన రైతులు కనీసం రబీలోనైనా వాతావరణం అనుకూలించాలని కోరుకుంటున్నారు. ఈపరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణం కార్యచరణ ప్రారంభించాలని అన్నదాతలు కోరుతున్నారు.

# షారంతా హుషారే

**- వరుస విజయాలతో భానుడిపై ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధం**
**- నేడు పిఎస్ఎల్‌వి సి-57 ప్రయోగం - ఈ ఏడాది ఇది 7వది**
**- లెక్కపరంగా షార్‌కి సరికొత్త చరిత్ర**



నింగికి గురిపెట్టిన పిఎస్ఎల్‌వి సి-57

శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : చంద్రయాన్-3తో ఇస్రో శాస్త్రవేత్తలు ప్రపంచ రికార్డు సాధిస్తే.. కేవలం 8 మాసాల వ్యవధిలో ఏడు రాకెట్లు ప్రయోగిస్తూ షార్ ఇంకో చరిత్రను తిరగరాస్తోంది. శనివారం ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని అంతరిక్షానికి మోసుకెళ్లనున్న పిఎస్ఎల్‌వి సి-57 రాకెట్ ప్రయోగం ఈ ఏడాది వరుసగా ఏడవది. ఇప్పటికి ఆరు విభిన్న తరహా రాకెట్లను శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఎనిమిది మాసాల సమయంలో ఇన్ని రాకెట్లు ప్రయోగించడం ఇదే మొదటిసారి. అందులో వందకు పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. కీలకమైన సూర్య చంద్రుల గుట్టురట్టు చేసే ఉపగ్రహాలు ఇందులోవి. శ్రీహరికోటలో 91వ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఇది 59వది. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఆదిత్య ఎల్1 ప్రయోగం కూడా విజయవంతమై భారత శాస్త్రవేత్తల కృషి ఫలిస్తుందని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఈ ప్రయోగ విజయం తర్వాత మరో నాలుగు నెలల పాటు కనీసం నాలుగు రాకెట్లను ఇక్కడ నుంచి ప్రయోగించే అవకాశం ఉంది. మధ్యమధ్యలో ప్రైవేటు సంస్థలు కూడా షార్ వేదికగా తమ రాకెట్లను ప్రయోగించడానికి ముందుకు వచ్చి ఉన్నారు. శనివారం జరిగే ప్రయోగానికి కేంద్ర శాస్త్రసాంకేతికశాఖ మంత్రి జితేంద్రసింగ్, సీనియర్ శాస్త్రవేత్తలు, పలువురు మాజీ ఇస్రో ఛైర్మన్లు, దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు, ఇటీవల చంద్రయాన్-3 ప్రయోగంలో పాలుపంచుకొని నీరాజనాలు అందుకుం టున్న పలువురు శాస్త్రవేత్తలు హాజరు కానున్నారు.

## ఇస్రో ఛైర్మన్‌కు సన్మానం



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన సంద ర్భాన్ని పురస్కరించుకొని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌ను శ్రీహరికోట ల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానానికి పూజల నిమిత్తం వచ్చిన ఆయనకు అసోసియేషన్ తరపున అభినందనలు తెలిపారు. త్వరలో జరగబోయే ఆదిత్య-ఎల్1 ప్రయోగంతో పాటు శ్రీహరికోట వేదికగా జరిగే అన్ని ప్రయోగాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శ్రీచెంగాళమ్మ తల్లి ఆశీస్సు లను ఇస్రో శాస్త్రవేత్తలకు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బైరి పార్థసారధిరెడ్డి, కోదండరామిరెడ్డి, విల్లు మహేష్, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయ సిబ్బంది సోమనాథ్‌ను సత్కరించారు. శ్రీహరికోట లాండ్ లూజెర్స్ అసోసియేషన్, జై గణేష్ కమిటీ అధ్యక్షు లు బైరి పార్థసారధిరెడ్డి ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కోదండరామ రెడ్డి, బిల్లు మహేష్ తదితరులు పాల్గొన్నారు. శ్రీహరికోట పాత్రికేయులు కూడా ఇస్రో ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. షార్‌లోని ట్రేడ్ యూనియన్ నాయకులు కూడా చంద్రయాన్-3 విజయం పట్ల ఇస్రో ఛైర్మన్ సోమనాథ్‌ను సత్కరించారు. అధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## అమ్మవారి ఆశీస్సుల కోసం వచ్చాం

**ఆదిత్య ఎల్-1 సక్సెస్ అవుతుంది: ఇస్రో ఛైర్మన్**



శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : ఆదిత్య ఎల్-1 ప్రయోగం సక్సెస్ అవుతుందన్న నమ్మకం ఉందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మన్ ఎస్. సోమనాథ్ ధీమా వ్యక్తం చేసారు. శుక్రవారం ఆయన షార్ అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి సమీపంలో ఉన్న సూళ్లూరుపేటలో వెలసిన శ్రీ చెంగాల మాతా పరమేశ్వరి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సుల కోసం ఇక్కడ ఆనవాయితీగా పూజలు చేస్తున్నామన్నారు. షార్ డైరెక్టర్ ఏ. రాజరాజ్, గ్రూప్ డైరెక్టర్ గోపికృష్ణ ఉన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు ముప్పాళ్ళ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది వీరిని స్వాగతించారు. ఆ తర్వాత వీరికి ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసారు.

## ఆడుదాం ఆంధ్ర విజయవంతంకు పక్కా ప్రణాళిక

**- జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అధికారులతో ఇన్‌ఛార్జీ కలెక్టర్ సమీక్ష

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడానికి సచివాలయాల నుండి జిల్లా స్థాయి వరకు పక్కా ప్రణాళిక రచించి అమలు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రామ సచివాలయ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఈ కార్యక్రమంలో పాల్గొనే అధికారులతో గ్రూపులు క్రియేట్ చేయడంతో పాటు దీనికి సంబంధించి షెడ్యూల్‌ను తయారు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతంకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అధికారులతో వాట్సాప్ గ్రూపులను సత్వరం ప్రారంభించాలన్నారు. మండల స్థాయిలో వార్డు లేదా సచివాలయ సిబ్బంది, హెడ్మాస్టర్, టెక్నికల్ కమిటీ పిఇటిలు వుండేలా చూడాలన్నారు. అలాగే మండల స్థాయిలో ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఎంఇఓలు, హెడ్మాస్టర్లు, పిఇటిలు వుండాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపిడిఓలు, తహసిల్దార్లు, గ్రౌండ్ ఇన్‌ఛార్జీలుగా ఇఓఆర్డీలు, ఇంజనీరింగ్ అధికారులు వుండాలన్నారు. అలాగే అన్ని బృందాల్లోను టెక్నికల్ బృందాలు వుండేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో తప్పనిసరిగా ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలు వుండేలా చూసుకోవాలన్నారు. కలెక్టర్ ఆమోదం మేరకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వాలీబాల్, బ్యాడ్మింటెన్, కబ్బడీ, ఖోఖోలతో పాటు 17 సంవత్సరాల నుండి పురుష, స్త్రీలకు బ్యాడ్మింటన్ వుండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఇఓ విజయేంద్ర రావు, జిల్లా యువజన అధికారి మురళీకృష్ణ, డిఎస్‌డిఓ బాలాజీ, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డిఎల్‌డిఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 1,081 కౌలు రైతులకు రూ.81 లక్షలు

**- ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



కౌలు రైతులకు నదగు జమ కార్యక్రమంకు హాజరైన ఇన్‌ఛార్జీ కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాత వార్త: రాష్ట్ర ప్రభుత్వం సొంత భూమి కల్గిన రైతు కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడంతో పాటు కౌలు రైతు కుటుంబాలకు సైతం వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ యోజన పథకం కింద లబ్ది చేకూర్చుతుందనిజిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లాలో 1,081 మంది కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా- పిఎం కిసాన్ యోజన కింద రూ.81 లక్షలు ఆర్థిక లబ్ది చేకూరిందన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరుసగా 5వ ఏడాది మొదటి విడతగా కౌలు రైతు కుటుంబాలకు వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ యోజన పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 1.46 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవాదాయ భూముల సాగుదారులకు తొలి విడతగా రూ.7,500 చొప్పున రూ.109.74 కోట్లు, పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.11.01 కోట్లు ఆర్థిక సహాయంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి వర్చువల్ విధానంలో జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రూ.కోట్లు వెచ్చించి వసతి గృహం...

# ఆదరణ లేక అస్తవ్యస్తం

**బస్సు సదుపాయం లేక విద్యార్థులు కరువు -వందలాదిమంది ఉండాల్సిన చోట 26 మంది -కుదేలౌతున్న ప్రభుత్వ పాఠశాలలు**



సమీకృత బాలుర వసతి గృహం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రి వద్ద నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవటానికి రూ,కోట్లు వెచ్చించి నిర్మించిన సాంఘీక సంక్షేమ వసతి గృహం(ఎపి సమీకృత బాలుర వసతి గృహం) విద్యార్థుల్లేక వెల వెల బోతుంది. పట్టణంలోని పాఠశాలలకు వెళ్ళాలంటే కిలో మీటర్ల దూరం వెళ్ళలేక కొందరు హాస్టల్‌లో నిలిచిపోతే కనీస సదుపాల్లేక మరి కొందరు విద్యార్థులు నిలిచిపోయారు. గత ప్రభుత్వ హయాంలో వందల మందితో కళ కళ లాడుతున్న సమీకృత బాలుర వసతి గృహం నాలుగేళ్ళలో క్రమేపి బక్క చిక్కిపోయింది. వసతి గృహం నుంచి పట్టణంలోని జిల్లా బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్ళాలంటే కనీసం రెండు కిలో మీటర్లు ఉంటుంది. అంత దూరం ఉదయం నడిచి వెళ్ళటం మధ్యాహ్నం భోజనానికి వచ్చి మళ్ళీ తిరిగి వెళ్ళాలంటే విద్యార్థులకు ఎంతో ఇబ్బందిగా మారిందని హాస్టల్ నిర్వాహకులు ఎన్నో సార్లు శాసనసభ్యుని దృష్టికి తెచ్చారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ దృష్టికి తెచ్చారు. కానీ వారు సమస్య విన్నపుడు 'అరచేతిలో స్వర్గం చూపారు!' కానీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. ప్రస్తుతం కేవలం ఈ సమీకృత వసతి గృహంలో 26 మంది విద్యార్థులుండటం గమనించదగ్గ విషయం. సుమారు 50 గదులున్న రెండతస్థుల భవనంలో విద్యార్థులు చేరాలంటే హాస్టల్‌ల్లో సదుపాయాలతో పాటు బస్సు సదుపాయం కల్పిస్తే తప్ప చేరరనేది జగమెరిగిన సత్యం.

**ప్రహారి గోడ లేదు... ఉన్న బోరు పని చేయదు:**

పట్టణ నడిబొడ్డులోని అయ్యలనాడు చెరువులో సువిశాలమైన స్థలంలో సమీ కృత బాలుర వసతి గృహం నిర్మించారు. ఇక్కడ ప్రారంభంలో సుమారు 500 మంది విద్యార్థులుండే వారు. విద్యార్థులతో కళ కళ లాడేది. వారిని విద్యా వంతులుగా తీర్చి దిద్దుటకు సత్ఫలితాలు సాధించుటకు రాత్రివేళల్లో క్లాసులు నిర్వహించే వారు. పరీక్షా ఫలితాల్లో కూడా ఇక్కడ విద్యార్థులుముందు వరుసలో ఉండే వారు. అయితే రాను రాను ఈ హాస్టల్ పరిస్థితి సమస్యల వలయంలో చిక్కుకుంది. అందమైన భవనం కానీ ప్రహారి లేదు. చుట్టూ ముళ్ళ పొదలు, పిచ్చిమొక్కలు మనిషి కంటే పొడవైన పాముల దర్శనం. హాస్టల్ భవనాల పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ చిన్నపిల్లల హాస్టల్, కళాశాల విద్యార్థుల హాస్టల్ ఉంది. ఏడాది క్రితం ఇక్కడ విద్యార్థుల సంఖ్య 15కి పడపోయింది. ప్రస్తుతం ఉన్న వార్డెన్ చొరవ తీసుకొని ప్రస్తుతం 26 మంది విద్యార్థులు చేసారు. ఇక్కడ రెండు బోర్లున్నాయి. ఒకటి పని చేయటం లేదు. ఒకటి పని చేస్తుంది. కానీ పైపులు బాగా లేదు. బోర్లు ఉన్నాయి. కానీ బాత్‌రూంలకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు, దాంతో పరిస్థితి ఆగమ్యాగోచరంగా మారింది.



-ప్రహరిగోడ లేక ఇబ్బందులు

**చిన్నపిల్లల హాస్టల్ మార్పుకు చర్యలు:**

అయితే చిన్న పిల్లల హాస్టల్‌ను పానగల్‌లోని ఓరియంటల్ సాధురామలింగ స్వామి ఆశ్రమంలోకి మార్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఆయన ఆప్రూవల్ చేస్తే ఓరియంటల్ స్కూల్‌కు మార్చుతారు. నాడు నేడు తో ప్రభుత్వ పాఠశాలల రాతలుమార్చిన ప్రభుత్వం వసతి గృహాల తీరు తెన్నులను పట్టించుకోకపోవటం గమనించదగ్గ విషయం.

## మున్సిపాల్టీలో కారుణ్య నియామకాలు

**చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం కారుణ్య నియామకాల ద్వారా ఇద్దరు, మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఒకరికి ఉద్యోగ నియామకాలను కమీషనర్ డాక్టర్ జె.అరుణ చేపట్టారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ అభ్యర్థుల దరఖాస్తులు, ధృవపత్రాలను పరిశీలించి, కుటుంబ సభ్యులను విచారించారు. ఈ మేరకు అందుబాటులో వున్న ఖాళీల మేరకు ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అలాగే మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందాల్సి న ప్రయోజనాలను వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాల్టీలో గ్యాంగ్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కె.సెల్వరాజ్ కుమార్తె కె.గుణవతిని గ్యాంగ్ మజ్దూర్, సహాయకులుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన విపి భాస్కర్ భార్య హేమావతిని సహాయకురాలిగా ఉద్యోగ నియామకం చేస్తూ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మెడికల్ ఇన్‌వాలిడేషన్ ఎసి శేఖర్ కుమారుడు ఎసి లోకేష్‌ను గ్యాంగ్ మజ్దూర్‌గా నియమించారు. ఈ మేరకు వీరికి మేయర్ అముద నియామక పత్రాలను అందించనున్నారు.

## సర్పంచ్‌పై చేయి చేసుకొన్న సిఐను సస్పెండ్ చేయాలి

**చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం మండల సర్వసభ్య సమావేశంలో గురువారం సర్పంచ్ కోకా ప్రకాష్‌నాయుడుపై చేయిచేసుకొన్న బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌ను సత్వరం సస్పెండ్ చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు ధనంజయయాదవ్, సుబ్రమణ్యం, ఇతర సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల చేత ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన సర్పంచ్ తన సమస్యలను విన్నవంచుకోవడానికి మండల సర్వ సభ్య సమావేశానికి వస్తే అతనిపై పోలీసులు చేయి చేసుకోవడం ప్రజాస్వామంకు గొడ్డలిపెట్టు అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులను ప్రక్కదారి పట్టించి కాజేస్తుందని ధ్వజమెత్తారు. పంచాయతీల్లో నిధులు లేక ఓట్లేసిన ప్రజలు నిలదీస్తుంటే ఏమి చేయలేని పరిస్థితుల్లో సర్పంచ్‌లు భిక్షాటన చేయాల్సి న పరిస్థితి ఏర్పడింద న్నారు. అమ్మ పెట్టదు అడుక్కునీయదా! న్యాయం అడిగిన సర్పంచ్‌పై పోలీసుల చేత కొట్టించడం అన్యాయమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం అయితే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడ్తామని వారు హెచ్చరించారు.

## ఏనుగు దాడిలో గాయపడిన యువకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**గుడిపాల, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** గుడిపాల మండలంలో రెండు రోజుల క్రితం ఏనుగు దాడిలో గాయపడి వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్(30)ను శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వేలూరు సిఎంసి ఆసుపత్రిలో పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగు దాడిలో గాయపడిన కార్తీక్ చికిత్స నిమిత్తం అయ్యే ఖర్చు పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్తీక్‌కు మెరుగైన వైద్యం అందించిన త్వరగా కోలుకొనేలా చేయాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బసవపల్లి సర్పంచ్ సుధాకర్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు

## తెలుగుదేశం నాయకులపై కేసులు నమోదు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

మండల సర్వసభ్య సమావేశంలో టిడిపికి చెందిన సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు భిక్షాటన చేస్తూ గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన వాదోపవాదాలు, ధర్నాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంను అడ్డుకోవడానికి కోకా ప్రకాష్ ప్రయత్నించారని ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ ఎదుట దేశం నాయకులు ధర్నా, రస్తారోకోలు చేయడంతో వారిపై మరో కేసు నమోదు చేశారు. ఇందులో పూతలపట్టు టిడిపి ఇన్‌ఛార్జీ మురళీమోహన్, మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి కోదండ యాదవ్, నాయకులు దొరబాబు, కృష్ణకుమారి, భాను, లత, మురళీ, ఎం.హేమచంద్ర నాయుడు, సుదర్శన్‌నాయుడు, శివ, వంశీ, జాకీర్, ధరణి, జగన్నాధనాయుడుతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ నాగరాజరావు తెలిపారు.

## నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగస్వాములు

– జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు పిలుపు



చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త: ఏక్ భారత్ శ్రేష్ట భారత్ విశ్వాసంతో అందరం కలిసి అందరి కోసం పని చేయాలనే భావనతో అమృత్ ఉత్సవాల్లో భాగంగా ప్రధాని మోడి ఆలోచనతో నా భూమి నాదేశం కార్యక్రమంను నేటి నుండి సెప్టెంబర్ 15 వరకు బిజెపి చేపట్టిందని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని వైఎస్‌ఆర్ నగర్‌లో శుక్రవారం జరిగిన నా భూమి నా దేశం కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, బిజెపి నాయకులు జ్యోతి, రెడ్డిమస్తాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్త పింఛన్లు పంపిణీ

నారాయణవనం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

మండలంలోని అర్హులైన 129 మందికి పింఛన్లను శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ పింఛన్లను అందించడం జరుగుతున్నట్లు తెలిపారు. మిగిలిన మరో రెండు వందల మందికి కూడా త్వరలోనే పరిశీలన జరిగిన తర్వాత వారికం అందించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడ కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పి.సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ వి.సారకాయలు, ఎంపీడీఓ గుణశేఖర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నాటుసారా కలిగిన నలుగురు వ్యక్తులు అరెస్ట్

నారాయణవనం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



మండలంలోని బెత్తలతడుకు గ్రామంలో నాటుసారా తయారీ, విక్రయాలు జరుపుతున్న నలుగురు వ్యక్తులను పుత్తూరు ఎస్‌ఈబీ సీఐ కృష్ణ, ఎస్సై నాగరాజు బృందం శుక్రవారం ఉదయం దాడులు చేసి పట్టుకున్నారు. పట్టుబడ్డవారిలో బెత్తలతడుకు దళిత వాడకుచెందిన పి.గోపి, పి.వెంకటేష్, పి.శ్రీనివాసులును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా వారికి 15 రోజులు రిమాం డు విధించారు. వీరి నుండి రెండు లీటర్ల సారా, 100 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

## నేడు కుప్పంలో మెగా జాబ్ మేళా

- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్



కుప్పం ,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ఆధ్వర్యంలో దివంగత సిఎం వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ తెలిపారు. సుమారు 17 సంస్థల ఆధ్వర్యంలో 1525 ఉద్యోగాలకు గాను ఆయా కంపెనీల ప్రతినిధులు ఇ ంటర్వ్యూలు నిర్వహిస్తా న్నారు. నిరుద్యోగయువతకు ఉపాధి కల్పించేందుకే ఈ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9963561755, 9390504632 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## నేడు శ్రీ యోగినారేయణ ఆత్మబోధామృత కార్యక్రమం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



కర్ణాటకలోని కైవారం సద్గురు శ్రీ యోగి నారేయణ మఠం ఆధ్వర్యం లో శనివారం కుప్పం మండలం గుత్తార్లపల్లి శ్రీ తిమ్మరాయస్వామి ఆలయం వద్ద శ్రీ యోగినారేయణ ఆత్మ బోధామృత కార్యక్రమం జరుగుతుందని కుప్పం శ్రీ సద్గురు యోగినారేయణ బలిజ సేవా ట్రస్ట్ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారణాసి బాలకృష్ణ భాగవతార్, డా॥ ఎంఆర్ జయరామ్‌చే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు గోపీనాథ్, ప్రభాకర్, మంజునాథ్, ఆర్‌ఆర్ రవి, సత్యేంద్రశేఖర్, వీసి మంజునాథ్, వెంకటాచలం, వెంకటరమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేత మృతి... పదివేల ఆర్థికసాయం



కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :

మున్సిపల్ పరిధి డికెపల్లికి చెందిన వైకాపా సోషియల్ మీడియా నేత సురేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ పార్టీ తరపున అతని అంత్య క్రియలకు పదివేల సాయం ప్రకటించారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. పార్టీ తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ టికె ప్రభాకర్, వెంకటేష్, కదిరప్ప, అరుణ్ కుమార్, భాగ్యరాజ్, ఎంఆర్‌పిఎస్ మురుగేష్, ఆంజనేయగుడి చైర్మన్ కుమరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టిడిపి నాయకులు

–అక్రమంగా ఇసుక తోడేస్తున్న పట్టించుకోని అధికారులు



పలమనేరు,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

పలమనేరులో అధికార పార్టీ నాయకులు కౌండిన్య నదిలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్న ఆధికారులు చర్యలు తీసుకో లేదంటూ టిడిపి నాయకులు విమర్శించారు.స్థానిక నాగమంగళం సమీపంలోని పట్టణానికి నీటి సరఫరా చేస్తున్న పంప్ హౌస్ వద్ద గత కొద్ది కాలంగా అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారని ఈ క్రమంలో శుక్రవారం టిడిపి నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా ఇసుకను తీస్తున్న జేసీబిను ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు.సమందిత అధికారులకు దీనిపై ఫిర్యాదు చేశారు.అయినప్పటికీ వారు స్పందించక పోవడంతో నిరసన వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని టిడిపి నాయకుల నిరసనను అడుకున్నారు.ఈ మేరకు టిడిపి నాయకులు మాట్లాడుతూ పట్టణంలో కొందరు నాయకులు ఆధికార అండతో ఇసుకను అక్రమ రవాణా చేస్తు లక్షలు ఆర్జిస్తున్నారని విమర్శించారు.ఇసుక అక్రమ రవాణాను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్ ప్రశ్నిస్తే ఆమెపై దౌర్జన్యం చేశారన్నారు.సమందిత అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రం స్పందన లేదన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

–సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసులు

పలమనేరు,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



చట్టాలపై విద్యర్థులకు అవగాహన తప్పనిసరి కలిగి ఉండాలని పలమనేరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు న్యాయ మూర్తి శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై నేటి యువత,విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యం రూపొందించుకుని వాటి సాధనకు కృషి చేయాలని తెలిపారు.న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి మాట్లాడుతూ కళాశాలలో జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేయడం నేరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది భాస్కర్,కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్,వైస్ ప్రిన్సిపల్ విజయశేఖర్ రెడ్డి,ఎస్ఐ సహదేవి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో అలహాబాద్ హైకోర్టు జడ్జి

కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్‌సింగ్ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్‌సపెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ఆమె పూజలు నిర్వహించారు. జడ్జి వెంట ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం పంపిణీ

తవణంపల్లె, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్ వన్ విద్యార్థినిలకు దాత అరగొండ మాజీ సర్పంచ్, మండల వైకాపా నాయకురాలు ఏ.రాజేశ్వరమ్మ శుక్రవారం ఉచితంగా యూని ఫాంను పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థినిలకు సుమారు లక్ష రూపాయలు విలువగల రెండు జతల యూనిఫాంను తన సొంత నిధులతో ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోహన్‌రెడ్డి, మండల వైకాపా నాయకులు అరగొండ కిషోర్ కుమార్‌రెడ్డి, అపోలో సంపూర్ణ ఆరోగ్య పథకం మేనేజర్ ధనుంజయ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## స్వల్ప ఘర్షణలో వ్యక్తి మృతి!

వాకాడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని బీసీ కాలనీ మల్లెపూలు సెంటర్‌కు చెందిన ఇరువురు బంధువుల నడుమ స్వల్ప వివాదం ఘర్షణకు దారి తీయడం క్షణికావేశంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే సేకరించిన సమాచారం మేరకు మల్లెపూలు సెంటర్‌కు చెందిన ఎస్‌కె ఖాధర్ భాషా, ఎస్‌కె కరిముల్లాలు ఇరువురు బంధువులు, చిన్న సంఘటనపై గురువారం రాత్రి ఆ ఇరువురి నడుమ వివాదం ఏర్పడడం, ఆ వివాదం ఘర్షణకు దారి తీయడం, ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఆ దాడిలో ఎస్‌కె ఖాదర్ భాషా (45)అక్కడకక్కడే మృతి చెందాడు. క్షణికావేశంలో జరిగిన ఈ దాడి ఓ నిండు ప్రాణాలను బలిగొన్నది. ఖాదర్ భాషా మృతికి కారణమైన కరిముల్లా పై కేసు నమోదు చేస్తామన్నారు. మృతుడు ఖాదర్‌భాషా పోస్టుమార్డం జరిగింది. మృతి చెందిన ఖాధర్ భాషా కుటుంబం కన్నీరు మున్నీరైయ్యారు.

## కోటమ్మ ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ పూజ

కోట,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా కోటలోని కోటమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.అనంతరం అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదిన, తవర ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకు న్నారు. పెద్దసం ఖ్య లో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి పర్యవేణలో జరిగాయి.

## మరపురాని మహానేత వైఎస్ఆర్

–ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :




వైఎస్ఆర్ అనే పదం వినగానే స్వచ్ఛమైన చిరునవ్వు మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. నమస్తే అక్కయ్యా, నమస్తే చెల్లెమ్మా, నమస్తే తమ్ముడూ అని అప్యాయంగా పిలిచే పిలుపు మన చెవుల్లో ఎప్పటికి ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైసిపి నాయకులు బత్తిన విజయ్ కుమార్ అన్నారు. అందుకే ఆ మహానేత చిరస్మరణీయుడు అని ప్రజల సంక్షేమ , రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక అడుగు వస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు వేస్తున్నారని అన్నారు. వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గం లోని చిట్టమూరు మండలం మల్లాంగ్రామంలోని హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం వైఎస్ఆర్‌చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిభిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ వైద్య శిబిరంలో పేదలకు వైద్య సహాయం అవసరమైన వారికి అందిస్తామని, దీన్నిగూడూరు నియోజకవర్గం ప్రజలు, మల్లాం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టుచైర్మన్ వైసిపి సీనియర్ నాయకులు బత్తిన విజయ్‌కుమార్, ముప్పాళ్ళ చంద్రమోహన్ రెడ్డి, అజీజ్ ఖాన్, సుభాన్, దగ్గోలు సురేంద్ర బాబు, అహ్మద్, దాసరి భాస్కర్, రఘు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సైకో పాలనకు స్వస్తి : మాజీ ఎమ్మెల్యే పాశం

చిల్లకూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సైకో పాలన అందిస్తున్నారని 2024 ఎన్నికల్లో చంద్రన్న పాలన తీసుకొస్తామని గూడూరు మాజీ ఎమ్మెల్యే, ఇన్చార్జి పాశం సునిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నూతనంగా ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని మోమిడి గ్రామంలో ప్రారంభించారు. ముందుగా తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి వున్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజ నిర్వహించడం జరిగింది. అనంతరం మోమిడి గ్రామంలో నియోజకవర్గంలో ఉన్న తెలుగు దేశం పార్టీ నాయకులతో కలిసి పర్యటించడం జరిగింది. అనంతరం ఇంటింటికి వెళ్లి మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు మోమిడి గ్రామానికి 69 లక్షల రూపాయిలతో సిసి రోడ్లు, చంద్రన్న భీమా కింద ఆరు లక్షలు రూపాయిలు, సిఎం సహాయ నిధినుంచి 3.67 లక్షలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మోమిడి గ్రామంలో ప్రారంభించడంతో ఆ గ్రామానికి చెందిన తెలుగు దేశంపార్టీ నాయకులు మేఘనూరు వెంకట కృష్ణయ్య, నాయకులకు శాలువ, పూలమాల, బాణాసంచాల నడుమ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల నీలావతి, కోట, చిల్లకూరు మండల అధ్యక్షులు వెంకటేశులు రెడ్డి, మద్దాలి సర్వోత్తమ రెడ్డి, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి వెంకటరమణా రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అన్నం మునిశేఖర్, మేకల కుమార్, పచ్చా వెంకటేశులు నాయుడు, మోగా శంకరయ్య, తీగల సురేష్, దారా సురేష్, జాకీర్, చిట్టేటి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, చిరంజీవి, తూపిలి చెందు, పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీ పరీక్షల పై అవగాహన కార్యక్రమం

గూడూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



ఎస్‌కెఆర్ కళాశాలలో పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశం పై వర్క్ షాప్‌ను ఈ నెల 4వ తేది ఉదయం 10 గంటలకు సోమవారం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 1,2 పరీక్షలు, పోలీస్ ఉద్యోగాలు, రైల్వే, బ్యాంక్ ఉద్యోగాల సాధన కొరకు పరీక్షల్లో ఎలాంటి మెళుకువలు పాటించాలని నిపుణులైన అధ్యాపకులు చేత వర్క్ షాప్ నిర్వహిస్తున్నందున నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వర్క్ షాప్‌కు హాజరు కావాలనుకునే పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ కొరకు వర్క్ షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ గోవిందు సురేంద్ర, చరిత్ర అధ్యాపకులు 9866008662ను సంప్రదించాలని తెలిపారు.

## గుడ్‌లక్ ఇస్రో

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



ఇస్రో అంతరిక్ష కేంద్రం నుండి శనివారం ప్రయోగించనున్న ఆదిత్య–ఎల్1 విజయవంతం కావాలని టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుడ్‌లక్ ఇస్రో ప్రదర్శన చేపట్టారు. శుక్ర వారం పాఠశాలలోని విద్యార్థులు గుడ్ ఇస్రో ఆకారంతో ప్రదర్శన నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగారు. ఇటీవల చంద్రయాన్–3 విజయవంతమై ప్రపంచ దేశాల్లో భారత్ పేరు గడించిందని పేర్కొన్నారు. అలాగే ఆదిత్య–ఎల్1 సైతం విజయవంతం కావాలని గుడ్‌లక్ ఇస్రో అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్లు షంషీర్‌ఖాన్, విజయకుమారిలు, ఉపాధ్యాయులు వేణురెడ్డి, వెంకటస్వామి, కేశవులు, వెంకటరమణ, దేవకి, అన్నపూర్ణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కంచర్ల సమక్షంలో తెదేపాలో చేరిక

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



ఎమ్మెల్సీ,టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో సామగుట్టపల్లికి చెందిన వైకాపా కార్యకర్తలు ఆదిత్య, రాజు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కుప్పం కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, కార్యకర్తల సంక్షేమ కమిటీ కన్వీనర్ త్రిలోక్, మాజీ ఎఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు తదితరులు పాల్గొన్నారు.

## అనిమిగానిపల్లిలో మహాశక్తి పథకాల ప్రచారం

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లిలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మహాశక్తి పథకాల గురించి తెలుగు మహిళ, తెదేపా నేతలు ప్రచారం నిర్వహించారు. తెదేపా అధికారంలో రాగానే 18–59ఏళ్ల మహిళలకు నెలకు రూ 1500లు, తల్లికి వందనం పేరిట చదివే ప్రతి పిల్లాడికి 15వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రెండు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. మహిళలు తెదేపా అధినేత చంద్రబాబును ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో తెలుగుమహిళ నాయకురాలు సరస్వతి, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## హమ్మయ్య కొత్త పింఛన్లు వచ్చాయోచ్ !!

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినెలా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద వృద్ధాప్య,వితంతు,వికలాంగతదితర పింఛన్లు అందిస్తున్న విషయం విదితమే. ఈ పింఛన్లను ఏటా జనవరి, జూలై నెలలో మాత్రమే కొత్తగా మంజూరు చేస్తారు. అయితే పింఛన్ల కోసం గత రెండు నెలలుగా దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న లబ్దిదారులకు శుభవార్తను అధికారులు వినిపించారు. సెప్టెంబర్ నెల నుంచి అర్హత కలిగిన వారికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. కుప్పం గ్రామీణ మండలంలో 784మంది దరఖాస్తు చేసుకోగా 368 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. మరో 416పింఛన్లు వెరిఫికేషన్ చేశారు. ఇవి కూడా రెండు మూడు రోజుల్లో మంజూరవుతాయని అధికారులు తెలిపారు. కుప్పం మున్సిపల్ పరిధిలో 300మందికి పైగా దరఖాస్తు చేసుకోగా 153పింఛన్లు మంజూరు కాగా మరో 163పింఛన్లను వెరిఫికేషన్ చేశారు. ఏది ఏమైనా రెండు నెలలపాటు పింఛన్ల కోసం ఎదురుచూసిన వారికి అధికారులు పింఛన్లను అందించనున్నారు.

## ప్రజలకు పక్కాగా సేవలు

పాలసముద్రం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సకాలంలో పక్కాగా సేవలు అందించాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్ కుమార్ ఆదేశించారు. ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ శుక్రవారం బాలకృష్ణా పురం, ఆముదాల, తిరుమలరాజుపురం, నరసింహాపురం గ్రామ సచివాలయా లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ విధులకు సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఈకెవైసి వంద శాతం పూర్తి చేయాలని, వాలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటల కల్లా అర్హులైన లబ్దిదారులను సామాజిక పెన్షన్లను అందించాలన్నారు. ఆముదాల సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను వారం రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నరసింహారాజుపురం హౌసింగ్ కాలనీని పరిశీలించిన ఎంపిడిఓ వ్యక్తిగత మరుగుదొడ్లు వంద శాతం పూర్తి చేసి సకాలంలో బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్డీ రమేష్‌బాబు, హౌసింగ్ ఎఇ దాము, పంచాయతీ కార్యదర్శి హరి, సర్పంచ్‌లు సీబా త్యాగరాజన్, మదివదన్, జీవితభాస్కర్, అమరావతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ఐసిడిఎస్ ప్రాజెక్టు శ్రీకాళహస్తి పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఖాళీగా ఉన్నవివిధ అంగన్‌వాడీ పోస్టుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ శాంతిదుర్గ తెలిపారు. శ్రీకాలహస్తి ప్రాజెక్టు పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుకు 1, మిని అంగన్‌వాడీ పోస్టు 1, అంగన్‌వాడీ హెల్పర్ 8 పోస్టులు ఉన్నాయన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కామిహరిజనవాడ మెయిన్ అంగన్ వాడీ కేంద్రం(ఎస్‌సి), శ్రీకాళహస్తి మండలంలోని వాగివీడులో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం పోస్టు(ఓసి), తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం వైసి కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రం(ఎస్‌టి), అంగన్‌వాడీ హెల్పర్స్ ఖాళీల్లో శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు(బిసి–ఎ), శ్రీకాళహస్తి పట్టణం లోని తూర్పు కొండమిట్ట(బిసి–బి), తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ–1 (బిసి–బి), రాంబట్లపల్లి(ఓసి), చిలకావారికండ్రిగ(ఓసి), శ్రీకాళహస్తి పట్టణంలోని కామిహరిజనవాడ(ఎస్‌సి), ఎంఎంసి కండ్రిగ(ఓసి), నారాయణపురం(ఓసి), ఖాళీలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీల నియామకంలో నిర్ణీత ఫారంలో ప్రకటన వెలువడిన తేదీ 29.8.2023 నుంచి 11.09.2023 వరకు అర్హులైన అభ్యరుధల నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు దారులు స్థానికులై ఉండాలని, అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు కుల ధృవీకరణ పత్రం, పదోతరగతి మార్కుల మెమో, ఆధార్‌కార్డు, వికలాంగత్వ మునకు సంబందించి పత్రాలను గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ చేసినవి జతపరచాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను కార్యాలయంలో స్వయంగా సమర్పించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.35లు మాత్రమే వసూలు చేయాలన్నారు. వివరాలకు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.

## మైనర్ బాలురకు వాహనాలు ఇస్తే జరిమానా తప్పదు



**తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మైనర్ బాలురకు వాహనాలు ఇస్తే జరిమానా తప్పదని వారితో పాటు తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని టుటౌన్ సిఐ మల్లిఖార్జున తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో భాగంగా స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ద్విచక్రవాహనాల తనిఖీ చేపట్టారు. పలువురు మైనర్ బాలురు వాహనాలు నడుపుతుండడం గుర్తించిన ఆయన వారి తల్లిదండ్రులకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలను నడుపుతూ లైసెన్సులు లేని వారికి ఆయన జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు. దూర ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించితే సురక్షితమన్నారు. మద్యంసేవించివాహనాలునడపరాదనిసూచించారు. తనిఖీల్లో టుటౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయానికి బీరువా వితరణ



**తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని పూడి దళితవాడలో నిర్వహిస్తున్న సీతారామ కృణ సమేత ఆంజనేయస్వామి చిత్రపీఠ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య గ్రామస్తుల ఆధ్వర్యంలో చిత్రపటాన్ని ప్రతిష్టించారు. కార్యక్రమానికి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి విచ్చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ఆలయానికి బీరువా వితరణగా అందించారు. అనంతరం చిన్నారులకు క్యారంబోర్డు అందించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి కత్తిరవి, కార్తీక్, వెంకటేష్, బాలు, అశోక్, ధనంజయులు, మనోహర్, మురళీ, మునిశేఖర్, ధనశేఖర్, ధనుష్, వెంకటేష్, చందు, నరేష్, మునిరాజ, హేమంత్, నాని, మోహన్, నితీష్, రాఘవ, సుభాష్, చంద్రయ్య, మురళీ, రవి, సుమంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నాయకునికి పవిత్రారెడ్డి పరామర్శ



**తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకుడు చిన్నరామిరెడ్డి మరియు పెద్దగంగిరెడ్డి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఏ బియ్యయ పుమధుసూదన్‌రెడ్డి తనయ బియ్యపువవిత్రారెడ్డి ఆయన నివాసానికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపిటిసి నరసింహులు, వెంకటేష్, అల్లెయ్య, గిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చెంచురామిరెడ్డి, చెంగారెడ్డి, సుబ్బరాయలురెడ్డి, రఘు, అంకిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ కందాడ వాసి మృతి



**ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్), సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని కందాడు దళితవాడకు చెందిన పారి అశోక్(30) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దళితవాడకు చెందిన పారి అశోక్ కేవిబిపురం మండలం కంచనపల్లి దళితవాడలో సమీప బంధువు వివాహ మహోత్సవానికి బుధవారం రాత్రి తిరిగి వస్తూ బత్తినయ్యకాలనీ రామాపురం మధ్యలో బైకుతో పాటు వాహన చోదకులు గుర్తించి ఆతని వద్ద ఉన్న సెల్ ఫోన్‌మోగుతుండగా తీసి బంధువులకు సమాచారం అందించారు. దాంతో బంధువులు ఆతన్ని మొదట రేణిగుంటలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్య సదుపాయాల కోసం రుయాకు తరలించారు. అయితే బంధువులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అశోక్ మృతి చెందినట్లు బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఏర్పేడు పోలీసులు తెలిపారు.

## ఎన్ని కష్టాలొచ్చినా, ఇబ్బందులేర్పడినా 1నే పెన్షన్లు



**ఏర్పేడు, (శ్రీకాళహస్తిరూరల్), సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక కష్టాలొచ్చినా, ఇబ్బందులేర్పడుతున్నా నిరుపేదలకు అందించే పెన్షన్‌ను ప్రతి నెల 1నే అందిస్తున్న జననేత జగనన్న అని ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పెన్షన్ల పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. మండల అభివృద్ధి అధికారి గిద్దయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు పార్టీ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు సర్పంచ్ శివయ్య, వైస్ ఎంపిపి తిరుపతి జనార్ధన్‌రెడ్డి సింగిల్ విండో అధ్యక్షులు జనార్ధన్‌యాదవ్ కో ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైకాపా నాయకులు రాజారెడ్డి, నాగార్జున్‌రెడ్డి, రమణయ్య యాదవ్, పోలయ్య, మునిరత్నం నాయుడు సర్పంచ్‌లు దొడ్డి మునిరామయ్య, మోహన్‌రెడ్డి, గాదే రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్బంగా జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

## శ్రీకాళహస్తిలో... నెల్లూరు వాసి ఆత్మహత్య!

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని ఓ ఇంటిలో నెల్లూరుకు చెందిన యువకుడు తన స్నేహితుని గదిలో ఫ్యాన్‌కు ఉనేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎఎస్ఐ మణి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులో మెకానిక్‌గా పని చేసే సురేష్‌బాబు(34) శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని సమీఉల్లాలమంచి స్నేహితులు. సమీఉల్లాశ్రీకాళహస్తిమండలంలోని థమ్స్ అప్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. గురువారం రాత్రి సురేష్‌బాబు తన స్నేహితుని ఇంటికి వచ్చారు. ఆతను గదిలో ఉండగా సమీ ఉల్లా విధులకు థమ్స్ ఫ్యాక్టరీకి వెళ్ళారు. అయితే సురేష్‌బాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆతని ఆత్మహత్యకు బహుశా కుటుంబ గొడవలు కారణం అయి ఉండవచ్చునని భావిస్తున్నారు. శుక్రవారం శవాన్ని శ్రీకాళహస్తిఏరియాఆసుపత్రికితరలించికేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ మణి వివరించారు.

## వివాహిత అనుమానస్పద రీతిలో మృతి!

వి.కోట సెప్టెంబర్1 ప్రభాతవార్త : మండలంలోని కల్లుపల్లి గ్రామంలో ఓ వివాహిత అనుమానస్పదరీతిలో మృతి చెందింది. అయితే వివాహితను ఆమె భర్తే హతమార్చాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, కుటుంబీకులు తెలిపినమేరకు వివరాలిలా..కల్లుల్లికి చెందిన ఇర్ఫాన్ (35)కు ఎం.ఎం.కుంటకు చెందిన తాహిరాబి(30)తో పదేళ్ళ క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. తరచూ భార్యభర్తల మధ్య గొడవలు సైతం జరిగేవన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఏం జరిగిందో తెలీదు గాని తాహిరాబి అనుమానస్పద రీతిలలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వి.కోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## గర్భవతులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో

**బాలాయపల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలు ఇస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. వెంగమాంబపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు.

## యువగళం పాదయాత్రకు అనూహ్య స్పందన

– టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు

వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:రాష్ట్రంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల్లో అనూహ్య స్పందన వస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో యువకులు, మహిళలు, అన్ని వర్గాల వారు ఉత్సంగా పాల్గొని ఘనస్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. రచ్చబండ సమావేశం నిర్వహించి స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు.

## రాష్ట్రంలో శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ నేతలు

**వెంకటగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించే విధంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రసంగాలు చేస్తున్నా రని, చర్యలు తీసుకోవాలని డక్కిలి ఎస్ఐ నాగరాజుకు వైసీపీ సోషల్ మీడియా వారు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం, అంతకుముందు కూడా పాదయాత్రలో 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తాం అని టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కోకన్వీనర్ వేముల శివకోటి, కొత్తపు సాయియాదవ్, రాజశేఖర్, అభిరామ్, వెంకటగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ పరుచూరి రమేష్‌గౌడ్, సచివాలయ సోషల్ మీడియా టీం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుజు డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ మార్కెట్లోకి విడుతల

తిరుపతి ప్రెస్‌క్లబ్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

ఇసుజు మోటార్స్ ఇండియా తమ పూర్తి సరికొత్త 'డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్' వేరియెంట్‌ను మార్కెట్లోకి విడుతల చేసింది. స్థానిక ఇసుజు మోటార్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టోరు కిషిమోటో మాట్లాడుతూ ది వాణిజ్య వాహన విభాగంలో 'స్మార్టెస్ట్'గా కనిపించే క్రూ క్యాబ్ పికప్, సాధారణతకు మించిన వాహనమని పేర్కొన్నారు. ఇది స్మార్ట్ లుక్స్, కఠినమైన, మన్నికమైన వర్క్ హార్స్ సామర్థ్యం, భద్రత, ప్రయాణీకుల వాహనపు తరహా సౌకర్యం వంటి కలయికతో భారతదేశంలో పికప్ సంస్కృతి, స్ఫూర్తిని కలిగి ఉందన్నారు. టాప్ ఎండ్ వేరియంట్ జోడితో పాటు ఈగిల్ ఇన్స్‌పైర్డ్ క్రోమ్ గ్రిల్, బై ఎల్ఇడి రపొజెక్టర్ ల్యాంప్‌లు, ఎల్ఇడి డిఆర్ఎల్ఏలు, ఫ్రంట్ ఫాగ్ ల్యాంప్స్, స్పోర్ట్ రూఫ్ రైల్స్, గన్ మెటల్ షార్క్ ఫిన్ యాంటెన్నా, కొత్త డిజైన్–6 స్పోక్ వీల్ కవర్లు, ఇంటిగ్రేటెడ్ క్రోమ్ ఓవిఆర్ఎమ్‌లు, క్రోమ్ డోర్ హ్యాండిల్స్, స్టైలిష్ యాంటీ స్కిడ్ సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి వినియోగదారుడు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా క్షేత్ర స్థాయి ఓటరు జాబితా తనిఖీ

–జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి



**చంద్రగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో ఓటరు జాబితా తనిఖీ పారదర్శకంగా వుండాలని జిల్లా కలెక్టర్, ప్రధాన ఎన్నికల అధికారి కె.వెంకట రమణారెడ్డి అన్నారు. భారత ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 2022 జనవరి 6 నుండి 2023 మార్చి 31 వరకు ఓటర్ల జాబితాలో జరిగిన తొలగింపులను శుక్రవారం ఆయన శానంబట్ల పంచాయతీ నందు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నేరుగా ఇంటింటికీ వెళ్ళి ఓటరుతో మాట్లాడి కుటుంబంలో ఓటర్ల వివరాలను స్వయంగా తనిఖీ చేశారు. ఇందులో మరణించిన, వలసపోయిన, తొలగించబడిన ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. భారత ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓలు పనిచేయాల్సి వుంటుదన్నారు. ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, తుడా సెక్రటరీ లక్ష్మీ, తహశీల్దార్‌శిరీషా, ఎంపిడిఓరమేష్‌బాబు, డిటిమోహన్‌రెడ్డి, విఆర్‌ఓ మునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**చంద్రగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసిన ప్రభుదత్ అనే నిందితుడిని చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిఐ రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన ప్రభుదత్ హైదరాబాద్ సెయింట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యాభ్యాసం చేసినట్లు తెలిపారు. చిన్న వయస్సులోనే నేరాలకు పాల్పడి బాలనేరస్థుడుగా శిక్షను అనుభవించిన ప్రభుదత్ 20 ఏళ్ళకే 33 కేసుల్లో ముద్దాయిగా వున్నట్లు తెలిపారు. కనిపించిన ద్విచక్రవాహనాలను లాఘవంగా చోరీ చేసి విలాసాలు చేసుకునే వాడన్నారు. బెంగుళూరులో పునరావాస కేంద్రంలో వున్నప్పటికీ తన తీరును మార్చు కోలేదన్నారు. నిందితుడు నుండి 4 ద్విచక్ర వాహనాలు, రూ.25 వేలు నగదు సీజ్ చేయడం జరిగిందన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ఎస్ఐలు హిమబింధు, రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## విశేష అలంకరణలో ద్రౌపథీ అమ్మవారు



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ఎన్.ఆర్.కమ్మపల్లి మహాభారత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పూజారి హరి ఆచ్చారి ద్రౌపథీ అమ్మవారిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. వేకువ జామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలపి నిత్య పూజ నిర్వహించారు. ఆలయ సమీపంలోని భావి నుండి నీటిని సేకరించి శ్రీకృష్ణ, పాండవ సమేత ద్రౌపథీ మాతకు విశేష అలంకరణ గావించారు. తిమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన దేగల మునెయ్య కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ నేపథ్యం లోనే తిరుపతికి చెందిన హరికథా భాగవతారిని జి.ఎస్.కె.సీతాలక్ష్మి, కురు పాండవ జననం హరి కథను చక్కగా ఆలకించారు.

## చికిత్స పొందుతున్న గృహసారథి ఆర్థిక భరోసా



**నగరి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** ఆపదలోఉన్న వారికి తానెప్పుడు అండగా ఉంటానని మంత్రి రోజా మండలంలోని తెరణి గ్రామానికి చెందిన గృహసారథి మోహన్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చి ప్రస్తుతం స్వగృహానికి చేరుకున్నాడు. శుక్రవారం తెరణి గ్రామానికి వెళ్లిన మంత్రి రోజా గృహసారథి మోహన్‌ను పరామర్శించి ఆరోగ్య విషయంపై ఆరా తీవారు. గృహసారథికి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. నాయకులంటే వాడుకునేవారు కాదని ఆపదలో ఉన్న ఆదుకునే వారే అని మంత్రి రోజా నిరూపించారు. ఆమె వెంట సర్పంచ్ నిర్మలా డింపుల్, స్థానిక నాయకులు మోహన్ పాల్గొన్నారు.

## సారా విక్రేత అరెస్టు



**నగరి, సెప్టెంబరు 1ప్రభాతవార్త:** విజయపురం మండలం, కేవీ పురం గ్రామంలో సారా విక్రయిస్తున్న ఆర్.కాటయ్య(47) అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్టు చేశారు. శుక్రవారం సమాచారం మేరకు సారా విక్రయాలపై ప్రాంతంలో సిబ్బందితో కలసి తనిఖీ నిర్వహించిన ఆమె సారా విక్రయిస్తున్న కాటయ్యను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 10లీటర్ల సారాను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, పీసీలు హిదయ్యతుల్లా, కార్తీక్, గురవయ్య పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

**నగరి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పుత్తూరుకు చెందిన కె.మురగారెడ్డి అనే న్యాయవాదిపై కొందరు చేయిసుకోవడాన్ని ఖండిస్తూ నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టుకు చెందిన న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం విధులను బహిష్కరించి నిరసనకు పాల్పడిన వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలులోకి తెచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్రహ్మణ్యంరెడ్డి, సోమసుందరి, ఉదయభాను, మహదేవన్, బాబు, ఇ.జి.బాబు, ధరణి తిరుమల పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని బజారు వీధిలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రవణ మాసం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం ఆలయంలోని పరివార దేవతలైన వినాయకస్వామి సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం లలితా సహస్రనామం పారాయణం కార్యక్రమా న్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఉభయ దాతగా ఓ.లేటి జలజ కుమారి, దేవస్థానం నిర్వాహకులు వ్యవహరించారు.

## పోషకాహార భద్రతతో సంపూర్ణ ఆరోగ్యం

**సత్యవేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** పోషకాహార భద్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక సర్పంచ్ మంజుల అన్నారు. శుక్రువారం దళవాయి అగ్రహారంలోని అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు రక్తహీనతకుగురౌతున్నపరిస్థితులు ఉన్నాయన్నారు. మహిళలు, గర్భవతులు, బాలింతలు సమతుల్యమైన పోషకారంను తీసుకోవడం ద్వారా సంపూర్ణఆరోగ్యవంతులుగా ఉంటారని అవగాహన కల్పించారు.

## బస్సు ప్రమాద క్షతగాత్రులకు మధ్యవర్తిత్వం



**తిరుపతి ప్రెస్‌క్లబ్ సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ఏపిఎస్ఆర్టీసి బస్సు ప్రమాదాలలో క్షతగాత్రులైన వారికి మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్‌మెంట్ చేసుకునే దిశగా డిఎల్ఎస్ఎ, చిత్తూరు జిల్లా సెక్రటరీ కరుణాకర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ తిరుపతి జిల్లా కమిటీ ఛైర్మన్ అండ్ ఆర్టిసి డిప్యూటీ సిటిఎం ఎం.భాస్కర్ రెడ్డి కార్యాలయంలో ప్రీ లిటిగేషన్ బాధితులు ఎం.వెంకటేశ్వర్లు, ఎ.నాగేశ్వరమ్మలకు న్యాయవాధి కెజెపి రెడ్డయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ నెల 9న తిరుపతి కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకుని ముగించుకోవలసినదిగా కోరారు. అదేవిధంగా తమిళనాడు, కాంచీపురం నందు ఫైల్ కాబడిన ఎంఎసిటి కేసుకు సంబంధించిన క్షతగాత్రుడు ఎం.మనోజ్ వేసిన పిటీషన్‌పై మధ్యవర్తిత్వం జరిపారు. ఇందులో బాధితులకు తగిన పరిహారం చెల్లించి లోక్ అదాలత్ ద్వారా కేసులు మూసివేయడానికి నిర్ణయించారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్ రెడ్డి ఆదేశాల మేరకు లోక్ అదాలత్ కేసులకు సంబంధించిన ప్రతిపాధనలను విజయవాడ ఆర్టీసి కార్యాలయానికి పంపారు.

## మహమ్మద్ ప్రవక్త సంతతిగా జన్మించటమే వరం



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మనం మహమ్మద్ ప్రవక్త సంతతిగా జన్మించటమే ఓ పెద్ద వరమని ఆయన ఆచరించిన విధానాలను అచరించి స్వర్గం ప్రాప్తించుకోవాలని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తకు ముందున్న ప్రవక్తల కాలంలో నమాజులు భారీగా ఉండేవని అయితే మహమ్మద్ ప్రవక్త వరంగా అల్లాహ్ ఆయన సంతతికి 50కిబదులు5పూటలనమాజులు అందించారన్నారు. అయితే ఎవరైతే క్రమశిక్షణతో ఐదుపూటల నమాజులు ఆచరిస్తారో వారికి 50పూటల నమాజు పుణ్యం లభిస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరు నమాజు చదవటం, చదివించటం, నేర్పించటం, మన పిల్లలకు ధార్మిక మార్గంలో నడవటం నేర్పించాలన్నారు.

ఫోటో : 1 తడ 1: తడలో టీచర్లకు ఆటల పోటీలు

## తడలో ఆటల పోటీలు

తడ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తడలో శుక్రవారం మండలంలోని టీచర్లకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో సరస్వతి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేసారు.

## శ్రీవకుళమాత ఆలయంలో లక్ష కుంకుమార్చన

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



శ్రీవకుళమాత ఆలయంలో ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ నారాయణ యజ్ఞంలో భాగంగా ముడోవ రోజు శుక్రవారం లక్ష కుంకుమార్చన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, సమాచారశాఖ మంత్రి చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ, రాజంపేట ఎం.పి.మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లిఎమ్మెల్యే ద్వారకనాధ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

## మాతమ్మకు సారె సమర్పించిన తుడ చైర్మెన్

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం మంగళం పరిధిలోని మిట్టగాంధీపురంలో కొలువుదీరిన శ్రీమాతమ్మకు శుక్రవారం తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె సమర్పించారు. సారె తీసుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరకున్న మోహిత్‌రెడ్డికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాతమ్మకు ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో మిట్టగాంధీపురం ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు పరిశుభ్రంగా చేపట్టాలి:కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :



నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశుభ్రంగా చేపట్టాలని కమిషనర్ హరిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ పరిధిలోని బైరాగిపట్టెడ, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత పటిష్టంగా చేపట్టాలన్నారు. వీధుల్లో, కాలువల్లో ఎవ్వరూ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా రోడ్లపైన, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే వారికి జరిమానాలు విధించాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త వాహనాలు ప్రతి రోజు నిర్ధిష్ట సమయంలో ప్రతి ఇంటికి వెళ్లేలా చూడాలని అన్నారు.

## సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి:కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ పరిధిలోని ముత్యాలరెడ్డిపల్లి కూడలిలో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ దండి మార్చ్ చుట్టూ పూల మొక్కలు ఎక్కువగా నాటాలని, లాన్ కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. మార్బుల్స్ కూడా ఒకే రంగులో చూపరులను ఆకర్షించేలా ఏర్పాటు చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. నగరంలో జరుగుతున్న సుందరీకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## పింఛన్లు, రైస్ కార్డులు పంపిణీ చేసిన మేయర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :

తిరుపతి నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని కొత్త ఫింఛన్లు, రైస్ కార్డులు మంజూరు అయిన వాటిని మేయర్ శిరీష లబ్ధిదారులకి పంఛన్లు, రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛన్ కానుక జనవరి ఒకటి నుంచి పెరిగిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లే అందజేస్తున్నదన్నారు. పింఛన్, రైస్ కార్డులు, ఆరోగ్య శ్రీ పథకాలు ఎంపికైన వారికి ప్రతి నెల మొదటి రోజే లబ్ధిదారుల గడప ముందుకొచ్చి పింఛను అందిస్తున్నామని తెలియజేసారు. గతంలోలా చాంతాడంత క్యూలలో వృద్ధులు, దివ్యాంగులు నిలబడే అవసరం లేవని, ఆత్మ అభిమానం చంపుకోవాల్సిన పనిలేదని తెలిపారు. ఒక వేళ పెన్షన్లు అందుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని, వారి దగ్గర ఉండి చెయ్యి పట్టుకుని నడిపించి పెన్షన్ అందే విధంగా సాయం చేస్తారని లబ్ధిదారులకి వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష తో పాటు చింత రమేష్, డివిజన్ కార్యదర్శి గోపాల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి

వడమాలపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:



మండలంలోని ఓబీఆర్ కండ్రిగ పంచాయతీని ఎస్సి, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన వారు ఓబీఆర్ కండ్రిగ ఏడబ్ల్యులో శ్మశాన వాటిక, శ్మశాన వాటికకు దారి సమస్య, ఆ గ్రామానికి రోడ్డు సమస్య, మురుగునీటి కాలువల సమస్య వాటర్ ట్యాంకు లీకేజీ గురించి అధికారులకు వివరించారు. అదే విధంగా ఓబీఆర్ కండ్రిగ ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య, శ్మశాన వాటిక సమస్య, వితంతువుల పెన్షన్ గురించి అధికారులకు తెలియజేశారు. అలాగే రామరాజు కండ్రిగ ఏఎడబ్ల్యు లో ప్రధానంగా శ్మశాన వాటికకు దారి, వాటర్ హెడ్ ట్యాంకు, గృహ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, మండల ఇంజినీరింగ్ అధికారులు, వైద్యశాఖ సిబ్బంది, పోలీసులు, నగరి నియోజకవర్గం ఎంఎస్‌పీ ఇన్‌చార్జి వావిళ్ళ శివయ్య మాదిగ, వడమాలపేట ఎంఎస్‌పీ అధ్యక్షుడు మధు మాదిగ, ఉపాధ్యక్షుడు పిడతల గురవయ్య మాదిగ, పర్రి గోవిందరాజ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి తులసిరాం మాదిగ, మంచికాయల మణి, ఓబీఆర్ కండ్రిగ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వడమాలపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:



తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్య ంలో నిర్వహించిన ఉచిత సిద్ధ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం మండలంలోని ఓబీఆర్ కండ్రిగ గ్రామంలో నిర్వహించిన శిబిరంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న 125 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్విమ్స్ డాక్టర్లు శ్యాంరాజ్, రాజ్యలక్ష్మి, అరుణా చలం, మండల వైద్యాధికారి చక్రపాణి, సామాజిక ఆరోగ్య అధికారి పురుషోత్తంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాబ్‌ల వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి

రేణిగుంట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అంద జేసిన ట్యాబ్‌లు వారి విద్యాప్రమాణాలు మెరుగు పడటానికి దోహదం చేస్తాయని రాష్ట్ర ఐటీ మానిటరింగ్ అధికారి సాయి రమేష్ అన్నారు. రేణిగుంట బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఐటీ మానిటరింగ్ అధికారి రమేష్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి(సీఎంవో) సురేష్‌తో కలసి సందర్శించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన బైజుస్ ట్యాబ్‌లను పరిశీలించారు. వాటిని రిపేరు చేయించి ఇస్తామన్నారు. విద్యార్థుల పురోగతిని ప్రధానాచార్యులు విష్ణువర్ధిని అధికారులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు ఉషశ్రీ, శారద, షాకీరా, బ్రహ్మం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించండి :సీపీఎం

రేణిగుంట, సెప్టెంబరు 1 ప్రభాతవార్తం



రేణిగుంట పంచాయతీ వీధుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీపీఎం పార్టీ నేతలు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. రేణిగుంట పంచాయతీలో ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి వెంటనే ఇంటి స్థలాలు చూపాలంటూ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. నిరసనను ఉధృతం చేస్తూ సెప్టెంబరు 4 తేదీ ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. అనంతరం సర్పంచ్ నాగేషంకు వినతిపత్రం సమర్పించారు. ధర్నా చేసిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, సీనియర్ నేత వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఈశ్వరమ్మ, కుప్పస్వామి, రాధాకృష్ణ, పద్మమ్మ, మహాలక్ష్మమ్మ, చిరంజీవి, హుస్సేన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన బొలెరో వాహనం

**సత్యవేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**

సత్యవేడు మేజర్ పంచాయతీలో మహీంద్ర బొలెరో వాహనం చోరీకి గురైన ఘటన శుక్రువారం వెలుగు చూసింది. భాదితుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా కోకో కోలా డిస్ట్రిబూటింగ్ చేస్తూ ప్రతిరోజూ దుకాణాలకు కూల్‌డ్రింగ్స్ సరఫరా చేస్తున్న యంయం ఎంటర్‌ప్రైజస్‌కు చెందిన బొలెరో వాహనం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సాధారణంగా దుకాణాలకు కూల్‌డ్రింగ్స్ తరలించేందుకు వినియోగించే ఈ వాహనం దాదాపు రూ॥8 లక్షల విలువ చేస్తుందని, కానీ ఎవరు చోరీకి పాల్పడ్డారని తెలియరాలేదన్నారు. సత్యవేడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలిస్తామని చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

# ఓటర్ జాబితాను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్, కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**
తిరుపతి నియోజకవర్గ పరిధిలో తొలగించబడిన ఓటర్ జాబితాను క్షేత్ర స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, తిరుపతి ఈఆర్ఓ హరితతో కలిసి తనిఖీ చేసారు. శుక్రవారం తిరుపతి నియోజకవర్గంలో మారుతీ నగర్, రాయల్ నగర్‌లోని 251, 252, 253, బైరాగపట్టెడ 148 తదితర పోలింగ్ బూత్‌ల పరిధిలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో జరిగిన తొలగింపులను క్షేత్ర స్థాయిలో వెరిఫై



చేయాలని ఇచ్చిన సూచనల మేరకు తిరుపతి నియోజక వర్గంలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో నేటి వరకు తొలగించబడిన ఓటర్ జాబితాను ర్యాండమ్‌గా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా డబుల్ ఎంట్రీ అయిన, చనిపోయిన, మరొక ప్రాంతానికి తరలిపోయిన, వలసపోయిన తదితర కారణాల వలన తొలగించబడిన ఓటర్ల జాబితాను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అర్బన్ వెంకటరమణ, ఎలక్షన్ డిటి జీవన్, సూపర్వైజర్లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

**వడమాలపేట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ అని నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నా రు. శుక్రవారం మండలంలోని పూడి గ్రామంలోని బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి బలమైన సంక్షేమ పునాదులపై ప్రగతి రథాలను నడిపించిందన్నారు. పార్టీ చిహ్నమైన సైకిల్‌రెండు చక్రాల్లో ఒకటి సంక్షేమానికి, మరొకటి అభివృద్ధికి ప్రతీకగా నిలిచాయన్నారు. భస్మాసుర పాలనలో అన్ని వర్గాల ప్రజలు అల్లాడిపోతున్నారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. మహిళాసాధికారత, భద్రత అటకెక్కింది. పెట్టుబడుల మాటే లేదు. నిరుద్యోగం పెరిగిపోయింది. బడుగు బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యం అయ్యాయి. ప్రజలకు మంచి చేసే చంద్రబాబును ఆదరించి ఆశీర్వదించండని ప్రజలను కోరారు. చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి ధనంజయలునాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, ధనశేఖర్, భరత్ కుమార్‌రెడ్డి, ధర్మతేజ, మణి, మురళి, కేశవులు, హేమాద్రి, ప్రభాకర్ రెడ్డి, మునిరత్నం, సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, హేమావతి, మునిరెడ్డి, బాలకృష్ణ, సుబ్రహ్మణ్యంరాజు, శేషాద్రి, వెంకటేశ్వరరావు, పి.వెంకటేష్, ఉమాపతి, బాబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారి చికిత్సకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కలెక్టర్

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**
లుకేమియా బ్లడ్ క్యాన్సర్ వ్యాధి చికిత్స కొరకు చిన్నారి పవిత్రకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఏడు లక్షల రూపాయిలు చెక్కును శుక్రవారం ఉదయం తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చిన్నారి బాబాయి, మేనమామకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స కొరకు ఆపన్న హస్తం కోసం వేచి ఉన్న 2 సంవత్సరాల 9 నెలల చిన్నారి బండ్ల పవిత్ర చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆరోగ్యశ్రీ అధికారులు ప్రతిపాదనలు పంపగా ఏడు లక్షల రూపాయిలు చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయ్యాయని వాటిని చిన్నారి చికిత్సకు సద్వినియోగం చేయాలని చిన్నారి బాబాయి, మేనమామకు అందజేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధికి మరోమారు పట్టం కట్టండి..!

-వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల చేసిన అభివృద్ధిని చూసి వైసిపికి మరోమారు పట్టం కట్టాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం నెత్తకుప్పం పంచాయతీలోని, ఎల్వీ పురం, కొత్తవేపకుప్పం, పాతవేపకుప్పం, మిట్టవేప కుప్పం గ్రామాలలో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో ఆయనకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను ప్రతి ఇంటికీ అందిస్తూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సిద్ధమునిరెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, సర్పంచ్ హిమాల్‌రెడ్డి, పంచాయతీ కన్వీనర్లు సాయిశశికాంత్, గంగరామిరెడ్డి, మణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేరళ భక్తుల కేకలు... జేబు దొంగల అదుపు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గేట్లు వద్ద, పార్కింగ్ వద్ద ప్యాకేజి మాట్లాడుకొని భక్తుల నెత్తిన టోపి వేసే కొందరైతే, తమలాగే భక్తుల్లా పక్కన వచ్చి జేబులు కత్తిరించే పార్టీలు కొందరు.ఎవరికి వారు ఎవరికి తోచిన విధంగా వారు భక్తులను మోసం చేస్తున్నారు.ఈ నేపధ్యంలో శుక్రవారం కేరళకు చెందిన మహిళా భక్తుల పర్సులను కత్తరించుటకు ప్రయత్నించి ఎస్‌పిఎఫ్ దళాలకు ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు. కేరళకు చెందిన భక్తులు భక్తిభావంతో స్వామి అమ్మవార్ల ఆలయానికి వెళుతుండగా ధ్వజస్థంభం వద్ద ఇద్దరు మహిళలు వారి బ్యాగులోని పర్సులను కట్ చేయటానికి విఫల యత్నం చేసారు. కేరళ భక్తులు కేకలు వేయగా ఇద్దరు మహిళలను అదుపులో తీసు కొనిప్రోటోకాల్‌కానిస్టేబుల్‌నరేష్‌కుఅప్పగించారు.ఆయనవన్‌టౌన్‌పోలీసు స్టేషన్లో హేమాద్రికి అప్పగించారు.

## శాస్త్రవిరుద్ధమైన నిర్మాణాలు ఆపండి..తెదేపా



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ప్రముఖ శైవక్షేత్రంగా ప్రసిద్ధిచెందిన జ్ఞానప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల కాలంలో జరుగుతున్న నిర్మాణాలలో రాతిశిలలను ఉపయోగించాల్సిన స్థానంలో రసాయ నాలు మరియు బూడిద మిశ్రమంలో తయారు చేసిన సిమెంటు రాళ్ళు వినియోగిస్తూ చేపట్టిన శాస్త్ర విరుద్ధమైన నిర్మాణాలు ఆపాలని తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. ఆలయంలోని ఇంజనీ రింగ్ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న పనులపై పత్రికల్లో వచ్చిన ఆరోపణలకు సంబందించిన వాస్తవాలను తెలుసుకోవడానికి శ్రీకాళహస్తి నియోకజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు మధ్యాహ్నం ఆలయం వద్దకు వెళ్ళి పరిశీలించారు. ఆలయాధికారులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మిన్నల్‌రవి, కాసరం రమేష్, వజ్రంకిషోర్, మునిరాజయాదవ్, పోలూరు శ్రీనివాసులురెడ్డి, ఉమేష్‌రావు, సునీల్, యశ్వంత్, భాస్కర్, మణి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జనసేనాని జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

-జనసేన తిరుపతి నగర అధ్యక్షుడు రాజారెడ్డి వెల్లడి

**తిరుపతి ప్రెస్‌క్లబ్,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



రేపటి రోజు ఆదివారం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో ఉదయం 7-30 నుండి సాయంత్రం 6-30 గంటల వరకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి వెల్లడించారు.ఈ మేరకు శుక్రవారం స్థానిక బైరాగిపట్టెడలోని జనసేన కార్యాలయం ఆవరణలో సేవా కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ను జనసైనికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం వైకుంఠపురం ఆర్చి వద్ద భవన నిర్మాణ కార్మికులకు అన్నదాన కార్యక్రమం తమ పార్టీ కార్యాలయం నందు మెగా రక్తదాన శిబిరం, చేపల మార్కెట్ సమీపంలోని స్కావెంజర్స్ కాలనీ వద్ద మహిళలకు చీరలు,విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, తిరుచానూరులోని నవజీవన్ అనాథ ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు,నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు.కావున నగరంలోని జనసైనికులు,వీరమహిళలు అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు హేమకుమార్,సుభాషిణి,కీర్తన,రాజేష్ ఆచారి, లక్ష్మి, కొండా రాజమోహన్,గుట్టా నాగరాజు,మనోజ్,హిమవంత్,దుర్గాదేవి, కిరణ్, ప్రసాద్, వంశీ,కౌశిక్,బాషా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి గంగజాతర ఆహ్వానించిన కమిటీ సభ్యులు

**నగరి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



నగరి పట్టణంలో సెప్టెంబరు 12,13వ తేదీల్లో గంగజాతర నిర్వహించనున్న నేపథ్యంలో జాతర కమిటీ సభ్యులు మంత్రి రోజాను సాంప్రదాయ బద్ధంగా ఆహ్వానించారు. శుక్రవారం మంత్రి నివాసానికి విచ్చేసి వారు మంత్రికి ఫల పుష్పాలను అందించడంతో పాటు గంగమ్మ అమ్మవారి పేరుతో తొలి సారిగా సిద్ధం చేసిన కండువాను ప్రప్రథమ ంగా మంత్రికి వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు మాట్లాడుతూ సెప్టెంబరు 5వ తేదీన జాతర చాటింపు, 12,13 తేదీల్లో గంగజాతర నిర్వహిస్తున్నామన్నారు. గ్రామదేవత దేశమ్మ దేవాలయాన్ని రూ.1.20 కోట్ల ఖర్చుతో పునర్నిర్మిస్తున్నందుకు, ఆలయానికి టీటీడీ నుంచి శేష వస్త్రాలు, పూలంకరణను సౌకర్యాలు కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి టీటీడీ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తానని జాతర నిర్వాహకులకు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, జాతర కమిటీ పెద్దలు చిరంజీవిరెడ్డి, జ్యోతిరెడ్డి, సుబ్రహ్మణ్యం, దేశమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబు, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, నాయకులు మణిగండ, బాలాజీ, శ్రీనివాసులు, బాలాజీ, రాజేష్, మహేష్, రవి, సూరి, విక్కీ, తిరుమల, జనార్ధన్‌రెడ్డి, షణ్ముగం, వాసు, శంకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## గాజుల అంకరణలో ముత్యాలమ్మ దర్శనం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో వెలసిన అమ్మవారికి 5116 డజన్లు 53200 గాజులతో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ చేపట్టారు. శుక్రవారం ఆలయంలో భక్తులతో నిండిపోయింది. అమ్మవారికి అలంకరణ పూజారి పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో చేపట్టారు.

## కన్యకా పరమేశ్వరిదేవికి దర్పణం పూజ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**
పట్టణంలోని బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం



సందర్భంగా అమ్మవారికి దర్పణంపూజ(లక్ష్మిదేవితో ఉద్భవించిన అద్దం) ఘనంగా నిర్వహించారు. సుమారు 60మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పూజల్లో పాల్గొన్న మహిళలకు వాయనంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి, వాసవి మహిళా మండలి, వాసవి సేవకులు మరియు వాసవి యువసేన భక్తులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో భేటీ అయిన ఎమ్మెల్సీ

**వెంకటగిరి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తో విజయవాడలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ నెల 9న ఆయనను నెల్లూరుకు ఆహ్వానించారు. దానికి ప్రవీణ్ ప్రకాష్ సదస్సుకు విచ్చేస్తానని తెలియజేశారు. ఆయన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ట్యాబుల నిర్వహణ, టోఫెల్ పరీక్షపై అవగాహన కల్పిస్తారన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలు, వసతులు గురించి తెలియజేసి ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను సమాజంలో అత్యుత్తమంగా తయారు చేసే నిమిత్తం ఈఈ సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహాలపై ప్రవీణ్ ప్రకాష్‌కు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# వైద్య కళాశాలలో బోధనా పద్ధతులపై అవగాహన

**తిరుపతి టౌన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**
శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ అనుబంధంగా ఉన్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాకాలలో శుక్రవారం ఎంబిబిఎస్ 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాల నందు బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిటిడి పాలక మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎంతో అదృష్టం వుంటేనే వైద్య వృత్తిలోకి రాగలుగుతారని అన్నారు. దేవదేవుని పాదాల చెంత పద్మావతి అమ్మవారి పేరిట వెలసిన మహిళా వైద్య కళాశాలలో సీటు రావడం దైవ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. దేశంలో కనీసం మందులు కూడ కొనలేని నిరుపేదలు ఉన్నారని అలాంటి వారికి వైద్య వృత్తిలోకి ప్రవేశించిన తరువాత సేవాభావంతో వైద్య సేలు అందించాలని ఉద్బోదించారు. అనంతరం స్విమ్స్ సంచాలకులు,



ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. స్విమ్స్‌ను ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం విద్యపై మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాశం పై దృష్టిని కేంద్రీకరించి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని స్విమ్స్ నందు వైద్య విద్యనందించడంలో ఎల్లవేళలా నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందిస్తామని తెలియజేసారు. ప్రిన్సిపల్ డా.టి. ఉషాకళావత్ మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్స రానికి 175 సీట్లకు గానూ ప్రస్తుతం 152 మంది విద్యార్థినిలు అడ్మిషన్లు పొందారని తెలిపారు. విద్యార్థినీలు మంచి నడవడికతో విద్యనభ్యసించి ఉన్నత డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినీలకు టిటిడి ఛైర్మన్ చేతుల మీదుగా ఎప్రాన్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమంలో డీన్ డా. అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డా.అపర్ణ బిట్ల, వైస్ ప్రిన్సిపల్స్ డా. ముక్తేశ్వరయ్య, డా.నాగరాజు, సిబ్బంది, విద్యార్థినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్లు పనులు పరిశీలించిన గూడూరు ఆర్డిఓ

**గూడూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**



గూడూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓబి పనులను, సిమెంట్ రోడ్లను డ్రైనేజీ కాలువలను అధికారులు ప్రణాళిక బద్ధంగా వారం వారం సమీక్షించుకుని సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కిరణ్ కుమార్ శుక్రవారం గూడూరు మున్సిపాలిటీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి 20 లక్షలు మంజూరైన క్రమంలో ఇటీవల వాటికి సంబంధించి 124 పనులు మొదలవడం జరిగింది. అయితే ఈ పనులను గూడూరు ఆర్డీవో, గూడూరు మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ సంబంధిత పనులను పరిశీలించారు. 100 (నాన్ టెండర్), 24 (టెండర్) మొత్తం 124 పనులకు చెందిన ఆరు కోట్ల రూపాయిలు నిధులు మంజూరైనాయని, దానికి సంబంధించి నేడు సనత్ నగర్, మాయాబజార్, ఈస్ట్ స్ట్రీట్ (పూలతోట) తదితర వార్డులలో పర్యటించి, పనులు జరుగుతున్న తీరుని పరిశీలించి, కాంట్రాక్టర్‌లకు అధికారులకు తగు సూచనలు చేశామన్నారు. ఇప్పటి వరకు 24 పనులు (రూ. 2.28 కోట్లు) పూర్తయినవని, 62 ప్రాసెస్‌లో ఉన్నవని, 38 ప్రారంభం కావలసి వున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.20 కోట్లు ఆదాయం

**కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.20 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 18 రోజులకుగాను హుండీల ద్వారా 1.20 కోట్ల రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 11 గ్రాముల బంగారు, 1 కిలో 030 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 8,877 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 687 అమెరికా డాలర్లు, 110 సింగపూర్ డాలర్లు, 22 మలేసియా రింగిట్స్,30 యూఏఈ దినార్స్, 5,501 సైది అరేబియా దినార్స్, 10 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ చిత్తూరు ఏసీ ఏకాంబరం, ఏఈఓలు ఎస్వీ. కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లురవి,రంగస్వామి,యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామిసేవకులుగా మరింత సమర్ధవంతమైన సేవలు

-టిటిడి పాలకమండలి ఎక్స్‌అఫిషియోసభ్యుడుగా ధర్మారెడ్డి ప్రమాణం



**తిరుమల,సెప్టెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:**
వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న లక్షమంది వరకు భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా మరింత కృషి చేస్తానని, సమర్ధవంతమైన సేవలందిస్తానని టిటిడి ఈఓ,పాలకమండలి ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఏవి ధర్మారెడ్డి ఉద్ఘాటించారు.53వ టిటిడి ధర్మకర్తలమండలిలో సభ్యులుగా శుక్రవారం ఉదయం ఏవి ధర్మారెడ్డి,బోర్డు సభ్యుడిగా తిప్పేస్వామి ప్రమాణస్వీకారం చేశారు. జెఇఓ సదాభార్గవి వీరికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఈఓ ధర్మారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు.

## వినియోగదారుల భద్రతే

ఇండియన్ గ్యాస్ సంస్థ లక్ష్యం
-మెళకువలు పాటించి గ్యాస్‌ను ఆదాచేయండి

**తిరుపతి,సెప్టెంబర్ 1ప్రభాతవార్త:**



వినియోగదారుల భద్రతే లక్ష్యంగా ఇండియన్ గ్యాస్ సంస్థ యాజమాన్యం అనేక మెళకువలు సూచిస్తోందని తిరుపతిలోని శ్రీనివాస ఇండేన్ గ్యాస్ ఏజెన్సీఅధినేత పి.నాదముని తెలిపారు. గ్యాస్ వినియోగంలో సూచనలు, జాగ్రత్తలు తమ సిబ్బంది వినియోగదారులకు ముఖ్యంగా గృహపకర గ్యాస్ మహిళలకు తెలియజేస్తున్నారన్నారు.శుక్రవారం ఉదయం 64వ ఇండియ్ ఆయిల్ డే సందర్భంగా లీలామహల్‌కూడలిలోని శ్రీనివాసా గ్యాస్‌ఏజెన్సీస్‌లో సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన పి.మోహన్‌కృష్ణ కేక్‌కట్ చేసి అధినేత నాదముని, సిబ్బంది రఘురామ్, సూర్యప్రకాశ్, మణి, రామ్మూర్తి, లక్ష్మయ్య,నాగరాజు,బాలలకు పంచి పెట్టారు. నమ్మకమైన సేవలందించడంలో ఏజెన్సీ యాజమాన్యం ముందుంటుందన్నారు.

## శివయ్య సేవలో రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి గోపినాథ్ మీనన్,ఆర్‌కె గ్రూప్స్‌కు చెందిన నిర్వాహకులు పద్మశ్రీ డాక్టర్ రవి పిళ్ళై సర్పదోషనివారణ పూజలు జరిపించుకున్నారు. శుక్రవారం ఆలయానికి అతిధుల తాకిడి అధికంగా ఉంది.ఈ నేపధ్యంలో అతిధులు రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ ఆదేశాలతో ఎఇఓ సతీష్‌మాలిక్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. వారు ఆలయంలో నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా సహస్రలింగే శ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో ఏర్పాటుచేసారు.పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.వారికి ఏర్పాట్లను శ్రీకాళహస్తి నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి కోలా ఆనంద్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా ఆలయంలో ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు.

## శివయ్య సేవలో రష్యాభక్తులు:

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని సేవలో శుక్రవారం భక్తులు ఓ మోస్తరుగా ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో విదేశీయుల రాక బాగా పెరిగింది. పర్యాటక శాఖ చొరవతో ఆలయాలకు మంచి ప్రాశస్త్యం వస్తుంది. ఈ నేపద్యంలో శుక్రవారం రష్యాకుచెందిన 20 మంది భక్తులు ఓ బస్సులో వచ్చారు. వారు ఆలయంలో పూజలు,సంప్రదాయాలనుచూసి ఆశ్చర్యపోయారు.అంతేకాక ఇక్కడి శిల్పకళను చూసిన వారు ఇది ఏ శతాబ్దంది అని అడిగి తెలుసుకున్నారు. వారు విజయస్థంభం వద్ద సెల్ఫీలు దిగారు.